ముంబై: బాలీవుడ్ ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్ మేనల్లుడు, నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసులు ఊహించని షాక్ ఇచ్చారు. అక్టోబర్ 28లోగా భారతదేశం విడిచి వెళ్లాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు. భారత పౌరుడు కానప్పటికీ రాజకీయ నిరసనలో పాల్గొన్నందుకే ఆయనపై ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 10న ముంబైలోని ఆగస్ట్ క్రాంతి మైదానంలో 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ), ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ ఆందోళనలో ఇమ్రాన్ ఖాన్ తన భాగస్వామి, నటి లేఖా వాషింగ్టన్, కజిన్ జేన్ మేరీ ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఆ సమయంలో పోలీసులు ఇమ్రాన్‌తో సహా సుమారు 400 మందిని అదుపులోకి తీసుకుని, ఆ తర్వాత విడుదల చేశారు. అయితే, ఇమ్రాన్ ఖాన్ భారత పౌరుడు కాదని, ఆయన అమెరికా పౌరసత్వంతో 'ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా' (ఓసీఐ) కార్డును కలిగి ఉన్నారని పోలీసులు గుర్తించారు. "భారత పౌరుడు కానప్పటికీ నిరసనలో పాల్గొన్నందున ఇమ్మిగ్రేషన్ చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం ఇమ్రాన్ ఖాన్‌పై చర్యలు తీసుకున్నాం" అని ముంబై పోలీసులు తమ నోటీసులో పేర్కొన్నారు. అరెస్ట్ సమయంలో ఇమ్రాన్ ఖాన్ పోలీస్ వ్యాన్ నుంచి "నేను డ్రైవ్‌కు వెళ్తున్నట్లున్నాను" అని క్యాప్షన్ పెట్టి ఫొటో పోస్ట్ చేశారు. అలాగే, పోలీసులతో 'జై హింద్' అని చెబుతున్న వీడియో కూడా వైరల్ అయింది. తనను ఎందుకు అదుపులోకి తీసుకున్నారో తెలియదని, సుమారు రెండు గంటల పాటు వ్యాన్‌లో తిప్పి వదిలేశారని ఆయన చెప్పిన మాటలు కూడా అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. ఈ నిరసనలో తుషార్ గాంధీ నేతృత్వంలోని 'హమ్ భారత్ కే లోగ్', సీపీఐ(ఎం) కార్యకర్తలు కూడా పాల్గొని అదుపులోకి గురయ్యారు. తాజా పోలీసు నోటీసులతో ఇమ్రాన్ ఖాన్ వ్యవహారం బాలీవుడ్‌లో కలకలం రేపుతోంది.

టీయూజేఏసీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడిగా ఎండీ అమృత్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15, :

తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీయూజేఏసీ) సిద్దిపేట పట్టణ అధ్యక్షుడిగా ఎండీ అమృత్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అమృత్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకంతో లభించిన ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి రన్నర్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 15, :

మండల కేంద్రంలో యువతలో క్రీడా స్ఫూర్తి, ఆరోగ్య స్పృహ పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పడిన మిరుదొడ్డి రన్నర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం స్థానిక క్రీడాకారులు, సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూచంగారి నరేష్, ఉపాధ్యక్షుడిగా ఎలుముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గొల్ల విజయ్ కుమార్, కోశాధికారిగా పూస రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ యువతలో రన్నింగ్ పట్ల ఆసక్తిని పెంచుతామని, మారథాన్లు, క్రీడా పోటీల్లో యువత రాణించేలా ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఎన్నికైన వారికి గ్రామ ప్రముఖులు, క్రీడాకారులు, యువకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇందిరమ్మ కాలనీ అన్నదాన కార్యక్రమానికి నర్సారెడ్డి భూపతిరెడ్డికి ఆహ్వానం



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బౌరంపేట్ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ వాసులు ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని గురువారం మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ని కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.

హఫీజ్ పేటలో సుప్రజా హాస్పిటల్ ప్రారంభోత్సవం

- **పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 15, :

హఫీజ్‌పేట్ డివిజన్‌లోని సుప్రజా హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గురువారం తెలంగాణ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఆర్థిక పథకాల ప్రయోజనాలు

- **ఆర్థిక సమ్మిళిత పథకాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ కట్టా హైమావతి**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15, :

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి డిసెంబర్ 31 వరకు సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ఆర్థిక సమ్మిళిత పథకాల సంపూర్ణ అమలు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి గురువారం ఆవిష్కరించారు. ఈ ప్రచారం ద్వారా అర్హులైన ప్రజలకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పథకాల ప్రయోజనాలను అందించడంతో పాటు, బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థ పరిధిలో కనీసం ఒక ప్రత్యేక అవగాహన, సేవా శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులకు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. ఆధార్ అనుసంధానం, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సేవలను కూడా అందించనున్నారు. బ్యాంకులు, శాఖల అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని లీడ్ బ్యాంక్ కార్యాలయం తెలిపింది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమకు అర్హత ఉన్న పథకాలలో నమోదు చేసుకోవాలని లీడ్ బ్యాంక్ కార్యాలయం కోరింది.

మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **పూల పండుగలో పాల్గొని సంప్రదాయ ఆటపాటలతో సందడి చేసిన మహిళా సిబ్బంది**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15, :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో మహిళా అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. గునుగు, తంగేడు, చామంతి, బంతి తదితర రంగురంగుల పూలతో మహిళా అధికారులు, సిబ్బంది స్వయంగా బతుకమ్మలను పేర్చి అందంగా అలంకరించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతను, పూల పండుగ వైభవాన్ని చాటుతూ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. అనంతరం అలంకరించిన బతుకమ్మలను తీసుకొని కోమటి చెరువుకు చేరుకున్న మహిళా సిబ్బంది సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రేరణ పాండ, వార్డు అధికారులు, మెప్మా అధికారులు, మున్సిపల్ మహిళా సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించాలి

- **యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి**
- **టీపీసీసీ కార్యదర్శి, ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి**



నంగునూరు, అక్టోబర్ 15, :

యాసంగి సీజన్‌లో రైతులు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధించాలని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి సూచించారు. గురువారం నంగునూరు మండలం సిద్దన్నపేట మార్కెట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు తీసుకుంటూ శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకుని పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటూ మెరుగైన దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించు కోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పంటలకు నిరంతర విద్యుత్ సరఫరా అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలమాకుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షుడు గంగుల రవి, పాలమాకుల గ్రామశాఖ అధ్యక్షుడు బస్వరాజ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల హెల్త్ కార్డుల సమస్యలను పరిష్కరించాలి

- **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎస్‌జీపీఏటీ సిద్దిపేట జిల్లా శాఖ వినతి**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15, :

పెన్షనర్లకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్య కార్డులు సక్రమంగా పనిచేయక పోవడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జీపీఏటీ) సిద్దిపేట జిల్లా శాఖ ప్రతినిధులు తెలిపారు. పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఆరోగ్య కార్డులు రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో సక్రమంగా పనిచేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ సెంటర్‌లో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించాలని కోరారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జోగు బిక్షపతి, జిల్లా అధ్యక్షుడు చిల్ల నరసింహులు, ప్రధాన కార్యదర్శి బోరెడ్డి మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇంద్రసేనారెడ్డి, పరశురాములు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, నాగేందర్, సత్తయ్య, బన్సీలాల్, లక్ష్మారెడ్డి, హనుమంత రెడ్డి, రవీందర్, రాములు, బాలెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లి క్రాంతి నగర్ కాలనీలో నూతన సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

బాచుపల్లి క్రాంతి నగర్ కాలనీలో నూతన సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గురువారం పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, గొట్టిపాటి మురళి, డీసీసీ జనరల్ సెక్రటరీ వై. రాజిరెడ్డి మరియు కాలనీ సభ్యులు పాల్గొన్నారు. కాలనీలో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయం. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించి, కాలనీ అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.



సాట్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



- **పాల్గొన్న మంత్రి వాకిటి సతీమణి లలిత, స్పోర్ట్స్ అథారిటీ వీసీ,ఎండి సోని బాలాదేవి.**

హైదరాబాద్ బ్యూరో, అక్టోబర్ 15, :

హైదరాబాద్‌లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి శ్రీమతి లలిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవితో పాటు అథారిటీ ఉద్యోగులు పాల్గొని బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకుంటూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పారు.

39వ వార్డులో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు





- మహిళల కోలాటాలు.. చిన్నారుల నృత్యాలు..
- వినూత్న బతుకమ్మలతో కనుల పండువగా వేడుకలు..

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15, :

సిద్దిపేట పట్టణంలోని 39వ వార్డులో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. మాజీ కౌన్సిలర్ దీప్తి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు మహిళలు, యువతులు, చిన్నారులు, స్థానికుల ఆటపాటలతో సందడిగా సాగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు.

వినూత్న బతుకమ్మలు.. వెండి బహుమతులు..

వివిధ రకాల రంగురంగుల పూలతో మహిళలు అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వినూత్న ఆకృతులు, విభిన్న రూపాలతో రూపొందించిన బతుకమ్మలతో వేడుకల ప్రాంగణం పూలవనాన్ని తలపించింది. ఉత్తమంగా బతుకమ్మలను పేర్చిన మహిళలను అభినందిస్తూ వెండి కుంకుమ భరణి పాత్రలను బహుమతులుగా అందజేశారు.

కోలాటాలు.. నృత్యాలతో పండుగ సందడి..

సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలు ఆడి సందడి చేశారు. ఆర్కెస్ట్రా కార్యక్రమాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి. కుటుంబ సమేతంగా హాజరైన స్థానికులు ఆటపాటల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

మహిళల్లో ఐక్యతకు ప్రతీకగా వేడుకలు

దీప్తి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తూ మహిళల్లో ఐక్యత, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైశ్య ఫ్యామిలీ అసోసియేషన్ (బురుజు), అశ్విన్ మగ్గం వర్క్స్ ప్రతినిధులతో పాటు ముఖ్య అతిథులుగా డాక్టర్ రజని గంద, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ అలేఖ్య పాల్గొన్నారు. వెంకటేశ్వర డైమండ్ అండ్ జ్యువెలర్స్ బహుమతుల ప్రదాతగా వ్యవహరించి, విజేతలకు వెండి కుంకుమ భరణిలను అందజేశారు.

కరెంటు కోతలు.. ఎల్‌నినో ప్రభావంతో ఎండిన పంటలు..

- చేతికొచ్చే దశలో పశువుల మేతగా మారిన వరి.. అన్నదాతల ఆవేదన..
- రెండున్నర ఎకరాల్లో పంట నష్టపోయిన ధర్మారం రైతు యాదగిరి

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 15, :

కరెంటు కోతలు, వర్షాభావ పరిస్థితులు రైతన్నను కష్టాల కడలిలోకి నెట్టాయి. పంట చేతికొచ్చే దశలో సాగునీరు అందక వరి పంట ఎండి పోవడంతో అన్నదాతలు తీవ్ర



ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో ప్రతికూల పరిస్థితుల కారణంగా వరి పంటలు ఎండుముఖం పట్టాయి. గ్రామానికి చెందిన యువ రైతు యాదగిరి రెండున్నర ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. పంట ఏపుగా పెరిగి చేతికొచ్చే సమయంలో సాగునీరు అందక పూర్తిగా ఎండిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు విద్యుత్ కోతలు, మరోవైపు వర్షాభావ పరిస్థితులతో పంటకు నీరందించలేకపోయానని తెలిపారు. ఎంతో ఆశతో సాగు చేసిన వరి పంట కళ్ల ముందే ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయానని వాపోయారు. పంట దిగుబడి వస్తుందని ఆశించిన సమయంలో వరి పంట పశువులకు మేతగా మారడం తనను కలచివేస్తోందని యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుల కోసం చేసిన ఖర్చులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతులకు ఇలాంటి పరిస్థితులు తీవ్ర భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతు యాదగిరి కోరారు. నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వంద పడకల ఆసుపత్రిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- బతుకమ్మ ఆటల్లో ఉత్సాహంగా పాల్గొన్న వైద్యులు, సిబ్బంది
- ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం
- సూపరింటెండెంట్ డాక్టర్ హేమ్రాజ్ సింగ్

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 15 :

విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే వైద్య సిబ్బంది బతుకమ్మ వేడుకలతో ఉత్సాహంగా గడిపారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం వైద్యులు, వైద్య సిబ్బంది కలిసి బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమ్రాజ్ సింగ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటడంతోపాటు, వైద్య సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని అన్నారు. నిత్యం రోగులకు వైద్య సేవలు అందిస్తూ బిజీగా ఉండే సిబ్బందికి ఈ వేడుకలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే



ముందు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది కలిసి బతుకమ్మలను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంతో ఆసుపత్రి ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది.

బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ జగన్

- సద్దుల బతుకమ్మ నాటికి పనులు పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఉన్న బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ గురువారం పరిశీలించారు. పలువురు సర్కిల్ అధికారులతో పాటు స్థానికులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ బతుకమ్మ కుంట అభివృద్ధి పనుల కోసం రూ.7 లక్షలు, బోర్‌వెల్ ఏర్పాటుకు రూ.5 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా స్థానిక మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి కుంటను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. తాను కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటి నుంచి ప్రతి సంవత్సరం బతుకమ్మ కుంటను సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌లోని ఆడపడుచులందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ బద్రు, ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, సోమయ్యనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు



తోక యాదగిరి, మహేందర్, ప్రకాష్, ప్రభాకర్, కుమారస్వామి, నవీన్, సంపత్ రెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగ వేడుకల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 15, :

జగిత్యాల పట్టణంలో బోనాల పండుగ, దుర్గా నవరాత్రుల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. టీఆర్ నగర్‌లో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల అర్బన్ కాలనీలో దుర్గా నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే టౌన్ హాల్‌లో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమానికి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవడం సంతోషకరమని అడువాల జ్యోతి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మొహమ్మద్ చాంద్ పాషా, భగవత్ బాంధవులు, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు.. అమ్మవారికి ప్రముఖుల ప్రత్యేక పూజలు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, : దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని దేవమ్మ బస్తీలో స్థానికులు ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్, మేడ్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జేకే. శేఖర్ యాదవ్, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు హైమావతి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రశాంత జీవనం సాగించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ కానుగంటి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రుద్ర అశోక్, కొలుకుల జైహింద్, కమిటీ సభ్యులు ప్రవీణ్ నాయ్, కుమార్ యాదవ్, రాములు, బస్తీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. అలాగే నాయకులు రాయి విష్ణేష్, జేకే. మహేష్ యాదవ్, గండి రాజు యాదవ్, మైలారం రాజు, అర్తీక్ యాదవ్, సునీల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

దేవి శరన్నవరాత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దమ్మని శ్రవణ్ కుమార్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, : గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, శివాలయం, వీరాంజనేయ స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని గురువారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తునికి కృష్ణారావు, ఎస్. శ్యామ్ రావు, పి. రాఘవేంద్రరావు, ఎల్. నాగభూషణం, వీరేష్, వి. అశోక్ గౌడ్, శ్రీనివాస్‌తో పాటు పలువురు మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి

- ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలి: వీరారెడ్డి నరేందర్ రెడ్డి



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

జీడిమెట్ల 132వ డివిజన్ (286) పరిధిలోని ఎంఎన్ రెడ్డి నగర్‌లో ఉన్న అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రే శామ్, ఉపాధ్యక్షుడు విరల్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఎల్లాగౌడ్‌తో పాటు ఇతర కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆయన ఆలయానికి విచ్చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి. ఈ సందర్భంగా వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, దుర్గామాత అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, చంద్రశేఖర్ రెడ్డితో పాటు వివిధ కాలనీలకు చెందిన నాయకులు, స్థానిక కాలనీవాసులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఎస్ఆర్ నాయక్ నగర్ అభివృద్ధికి కీలక ముందడుగు

- మున్సిపల్ కమిషనర్‌తో మన్నె రాజు చర్చలు
- కాలనీ అభివృద్ధి పనులకు సంపు స్థలం వినియోగంపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ శ్రీజన

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

ఎస్ఆర్ నాయక్ నగర్ కాలనీ అభివృద్ధి పనులకు సంబంధించి మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు గురువారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, ఐఏఎస్‌ను కలిసి పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్. నాయక్ నగర్ కాలనీలోని సంపు స్థలాన్ని కాలనీ అభివృద్ధి పనుల కోసం వినియోగించుకునేందుకు సహకరించాలని మన్నె రాజు కమిషనర్‌ను కోరారు. కాలనీ అభివృద్ధికి ఈ స్థలం ఉపయోగపడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మన్నె రాజు విజ్ఞప్తిపై స్పందించిన కమిషనర్ శ్రీజన, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారితో చర్చించిన అనంతరం తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. దీంతో కాలనీ అభివృద్ధి పనులపై ఆశలు చిగురించాయని స్థానికులు భావిస్తున్నారు. ఈ సమావేశంలో ఎస్.ఆర్. నాయక్ నగర్ కాలనీ అధ్యక్షుడు బాబి, మాజీ అధ్యక్షుడు టక్ శ్రీను, కిషోర్, చంద్రకాంత్‌తో పాటు కాలనీకి చెందిన పలువురు పాల్గొన్నారు. కాలనీ అభివృద్ధే లక్ష్యంగా.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్ఆర్ నాయక్ నగర్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా స్పష్టమైంది.



మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

- రూ.18 వేల జరిమానా విధించిన సిద్దిపేట కోర్టు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15, :

మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి అపహరించి, పెళ్లి చేసుకొని అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడు బండి భాస్కర్ (27)కు సిద్దిపేట మొదటి అదనపు జిల్లా న్యాయస్థానం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.18 వేల జరిమానా విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి వై జయప్రసాద్ తీర్పు వెలువరించారు. నంగునూరు మండలానికి చెందిన మైనర్ బాలికను నిందితుడు ప్రేమ పేరుతో నమ్మించి పెళ్లి చేసుకొని అత్యాచారానికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు 2022 ఏప్రిల్ 22న రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్‌లో



పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అప్పటి దర్యాప్తు అధికారి, రాజగోపాలపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పటిష్టమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది సాదుల ఆత్మారాములు వాదనలు వినిపించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, భరోసా కేంద్రం అధికారులు సమన్వయంతో విచారణకు సహకరించారు. సాక్షుల వాంగ్మూలాలు, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిని దోషిగా నిర్ధారించి శిక్ష విధించారు.

మరో కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష

సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017 డిసెంబర్ 17న నమోదైన మరో కేసులో నిందితుడు మిట్టపల్లి రాజు (35)కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వై జయప్రసాద్ తీర్పు వెల్లడించారు. అత్యాచారయత్నాన్ని ప్రతిఘటించిన బాధితురాలిపై నిందితుడు కర్రతో దాడి చేసి తలకు గాయం చేసినట్లు కేసు నమోదైంది. ఈ రెండు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ అభినందించారు.

మహిళలు, పిల్లల భద్రతకు ప్రాధాన్యం

మహిళలు, పిల్లలపై జరిగే నేరాల విషయంలో బాధితులు భయపడకుండా, వెనుకాడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా చట్టప్రకారం చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

దసరా వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి


- అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న 55 అడుగుల రావణాసురుడి బొమ్మ
- స్టేడియం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, దసరా వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచన

సదాశివపేట, అక్టోబర్ 15, :

సంగారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం పరిశీలించారు. రావణ దహనం కోసం సిద్ధం చేస్తున్న 55 అడుగుల రావణాసురుడి బొమ్మతో పాటు బాణసంచా కాల్చేందుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.గత ముప్పై ఏళ్లుగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో ఏటా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భారీ రావణాసురుడి బొమ్మ దహనం, పెద్ద ఎత్తున బాణసంచా ప్రదర్శనతో పాటు ప్రముఖ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జగ్గారెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.ఏర్పాట్ల పరిశీలన సందర్భంగా స్టేడియంతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జగ్గారెడ్డి సూచించారు. ముళ్లకంపలను తొలగించి, చెత్తాచెదారం లేకుండా మైదానాన్ని శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి, ఉత్సవ నిర్వాహకులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, భవాని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బెస్త నగేష్, సభ్యులు, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్ గౌడ్ , శ్రీహరి తదితరులు పాల్గొన్నారు



దూలపల్లిలో శ్రీ లక్ష్మీ సారీ షాప్ ప్రారంభం



- చీర భారతీయ మహిళల సంస్కృతి, సంప్రదాయం, ఆత్మగౌరవానికి ప్రతీక
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

మహిళల అభిరుచులకు అనుగుణంగా దూలపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన నూతన వస్త్ర దుకాణం శ్రీ లక్ష్మీ సారీ షాప్‌ను గురువారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, చీర భారతీయ మహిళల సంస్కృతి, సంప్రదాయం, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. భారతీయ సంప్రదాయంలో చీరకు ప్రత్యేకమైన స్థానం ఉందని, మహిళల అభిరుచులకు అనుగుణంగా దూలపల్లిలో శ్రీ లక్ష్మీ సారీ షాప్ ప్రారంభం కావడం సంతోషకరమని అన్నారు. ఈ షాప్ మహిళల ఆదరణ పొందుతూ, వ్యాపార రంగంలో మంచి అభివృద్ధి సాధించాలని నిర్వాహకులు జి. మాధవి, మహేశ్వరిలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ వైస్ చైర్మన్ గంగయ్య, మాజీ కౌన్సిలర్ దేవేందర్ యాదవ్, డప్పు కిరణ్, పీఏసీఎస్ డైరెక్టర్లు మధుసూదన్, శ్రీనివాస్, మల్లేష్, సీనియర్ నాయకులు బూరుగుభావి సత్యనారాయణ, గంగయోల వెంకటేష్, అందే మహేష్, అందే యాదగిరి, మంత్రి రఘునాథ్, నాగరాజు, మలిగే సుధాకర్, షాప్ నిర్వాహకులు జి. మాధవి, మహేశ్వరి, స్థానిక ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ 278 గాజులరామారం డివిజన్ అధ్యక్షుడిగా సుంకరి సాయిప్రతాప్ ముదిరాజ్

- ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, రావుల శేషగిరికి కృతజ్ఞతలు
- పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా: సాయిప్రతాప్

గాజులరామారం, అక్టోబర్ 15, : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 278 గాజులరామారం డివిజన్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సుంకరి సాయిప్రతాప్ ముదిరాజ్ గురువారం పార్టీ ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ కో-కన్వీనర్, మాజీ కార్పొరేటర్ రావుల



శేషగిరిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు సాయిప్రతాప్‌ను శాలువాతో సత్కరించి, నూతన బాధ్యతలపై శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ స్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తా ఈ సందర్భంగా సుంకరి సాయిప్రతాప్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అగ్రనాయకత్వానికి, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయకుల ఆశీస్సులు, మార్గదర్శకత్వంతో గాజులరామారం డివిజన్ పరిధిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడతానని, పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు గరిగే శేఖర్ ముదిరాజ్, పట్లోళ్ల శ్రీనివాస్ రెడ్డి, రాజు యాదవ్, దమ్మని యశ్వంత్, తెల్ల బాల్‌రాజ్‌తో పాటు డివిజన్ పరిధిలోని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు పాల్గొని నూతన అధ్యక్షుడు సుంకరి సాయిప్రతాప్ ముదిరాజ్‌కు అభినందనలు తెలిపారు.

జగద్గిరిగుట్టలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

తెలంగాణ ప్రజానాట్యమండలి, భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం జగద్గిరిగుట్ట చివరి బస్‌స్టాప్ వద్ద బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ బస్తీలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సుమారు మూడు గంటల పాటు బతుకమ్మ ఆడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ సమితి సభ్యులు ఎం.డి. యూసుఫ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం హాజరయ్యారు. అలాగే ప్రజానాట్యమండలి నాయకులు హైమావతి, మాధవి, ప్రమీల, వెంకటాచారి, గౌరవాధ్యక్షులు ప్రవీణ్, భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జె. లక్ష్మి , జిల్లా నాయకులు మహాలక్ష్మి , చంద్రమ్మ, నీలమ్మ, దీపిక పాల్గొన్నారు. స్థానిక సీపీఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి రాములు, హరినాథ్ రావు, వెంకటేష్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, యువజన సమైక్య అధ్యక్ష కార్యదర్శులు కీర్తి, ప్రవీణ్, సదానందతో పాటు సీపీఐ, మహిళా సమాఖ్య కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని



తెలంగాణ ఆడపడుచుల ఐక్యతను చాటారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ వాటిని కాపాడుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఎంపీ నిధుల ద్వారా ఐమోస్ట్ లైట్లు మంజూరు

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 15, :

జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి, రాయికల్ టౌన్ లో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నిధుల ద్వారా ఐమాస్ట్ లైట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని గురువారం బిజెపి జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ బోగ శ్రావణి అందజేయడం జరిగింది. గ్రామంలో రాత్రివేళల్లో మెరుగైన వెలుతురు కల్పించడంతో పాటు ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించేందుకు ఈ హైమాస్ట్ లైట్లు ఎంతగానో ఉపయోగపడనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, జగిత్యాల్ పట్టణ అధ్యక్షులు కాశెట్టి తిరుపతి, స్థానిక కౌన్సిలర్ కల్లెడ ధర్మపురి, సురేష్, రాము, ఆముదరాజు, తక్కలపల్లి గ్రామ ఉపసర్పంచ్ కచ్చు మునిరాజు, బన్న సంజీవ్, గుర్రాల తిరుపతి రెడ్డి, పవన్ సింగ్, రవితేజ బోగ నరేష్, శ్రీనివాస్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇద్దరు బాధితులకు రూ.1.85 లక్షల ఎల్ఓసీలు అందజేత

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరు పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.1.85 లక్షల విలువైన ఎల్ఓసీలు మంజూరయ్యాయి. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ చొరవతో ఈ ఆర్థిక సహాయం అందింది. కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన జి ఎల్లయ్య (53), బాచుపల్లి తిరుమలనగర్‌కు చెందిన వై సుబ్బాయమ్మ (67) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ఆశ్రయించారు. వారి పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న ఎమ్మెల్యే, ఎల్లయ్యకు రూ.1,10,000, సుబ్బాయమ్మకు రూ.75,000 చొప్పున సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎల్ఓసీలు మంజూరు చేయించారు. ఈ మేరకు గురువారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, చంద్ర వెంకటేశ్వరరావు, 132వ డివిజన్ నాయకులు



కుంట సిద్ధిరాములు, సంపత్ మాధవ రెడ్డి, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఆటో బలరాం, జయం చారి, చంద్రశేఖర్ రెడ్డి, నార్కంటి శ్యాం, కాలే నాగేష్, కాలే గణేష్, బాల మల్లేష్‌తో పాటు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ఓటు హక్కును కాలరాసే హక్కు ఎవరికీ లేదు

- సర్ ప్రక్రియపై అనుమానాలు నివృత్తి చేయాలి
- యువత, విద్యార్థులపై నిర్బంధాన్ని ఖండించిన కవులు, రచయితలు, ప్రజాసంఘాల ప్రతినిధులు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15, :

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని కవులు, రచయితలు, జర్నలిస్టులు, ప్రజాసంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో చేపట్టిన సర్ ప్రక్రియలో గందరగోళం నెలకొందని, అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగిపోతున్నాయనే ఆందోళనలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు.మంజీరా రచయితల సంఘం, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సిద్దిపేట జిల్లా శాఖ, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక, తెలంగాణ వికాస సమితి, తెలంగాణ రచయితల సంఘం, ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో చర్చాగోష్టి నిర్వహించారు. మంజీరా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అనర్హుల ఓట్ల తొలగింపు పేరుతో అర్హులైన ఓటర్ల ఓట్లు కూడా తొలగిపోతున్నాయనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. బతికి ఉన్న ఓటర్లకు నోటీసులు ఇవ్వడం, ప్రభుత్వ గుర్తింపు కార్డులు, విద్యా ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోక పోవడం సరికాదన్నారు. మరణించిన వారి, రెండు చోట్ల ఓట్లు కలిగినవారి వివరాలను ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. గతంలోనూ ఓటర్ల జాబితా సవరణలు జరిగినప్పటికీ, ప్రస్తుతం నెలకొన్న గందరగోళం అనేక సందేహాలకు తావిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారి ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందనే అనుమానాలు



కలుగుతున్నాయని పేర్కొన్నారు. సర్ ప్రక్రియను నిలిపి వేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియపై ప్రశ్నిస్తూ ఢిల్లీలో ఉద్యమిస్తున్న యువత, విద్యార్థులపై నిర్బంధ చర్యలను తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని కోరుతూ, వారి ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నాల బాలయ్య, తెలంగాణ వికాస సమితి అధ్యక్షుడు నందిని భగవాన్‌రెడ్డి, తెరసం గౌరవ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట యాదగిరి, ప్రజాసంఘాల నాయకుడు పోచబోయిన శ్రీహరి, జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూతురు రాజిరెడ్డి, ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు వి సంతోష్, ప్రముఖ కవి అలాజ్‌పూర్ కిషన్, మంజీరా రచయితల సంఘం ఉపాధ్యక్షులు అలాజ్‌పూర్ శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి రూ.1.10 లక్షల సీఎంఆర్ఎఫ్ వైద్యసాయం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఇందులో భాగంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ చొరవతో జీడిమెట్ల 132వ డివిజన్ (286), కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన జి. ఎల్లయ్య (53)కు రూ.1,10,000 విలువైన ఎల్ఓసీ మంజూరైంది. ఈ ఎల్ఓసీని చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచి, మెరుగైన వైద్యం పొందేందుకు సహకరించడం ప్రజాసేవలో భాగమని పేర్కొన్నారు. పేద ప్రజలకు వైద్యసాయం అందేలా చొరవ తీసుకుంటున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, కుంట సిద్ధి రాములు, సమ్మయ్య నేత, కాలె నగేష్, ఆటో బలరాం, గణేష్, జయంచారి, చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి వై జంక్షన్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం

- రహదారి భద్రత ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత
- ఓబీసీ మోర్చా కన్వీనర్ ఆనంద్ గౌడ్

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 14, :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా గురువారం కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, మేడ్చల్– మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జేకే శేఖర్ యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి



రాజేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర బీజేపీ మున్సిపల్ సెల్ కో–కన్వీనర్ రావుల శేషగిరి, ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యతని, రహదారి భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నళ్లను గౌరవించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడవద్దని వాహనదారులకు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చనే సందేశాన్ని నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుజాత, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ కర్ణ శ్రీ, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్ గౌడ్, ఉపాధ్యక్షులు యాదగిరి, జిల్లా కార్యదర్శులు శ్రీధర్ వర్మ, రేణుక, రమేష్ నేత, కుత్బుల్లాపూర్‌కు చెందిన శ్రీనివాస్ గౌడ్, నరసింహ చారి, జిల్లా అధికార ప్రతినిధి వినోద్ కుమార్, సబిత యాదవ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అనురాధ దేవి, లక్షి , విజేత, శ్రీదేవి, బీజేపీ సీనియర్ నాయకుడు కంచి మహేందర్, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కైలాపూర్ డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, అసెంబ్లీ కో–కన్వీనర్ శివ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9వ ఫేజ్ కాలనీ నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభినందనలు



ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

- దండమూడి కాలనీలోని నివాస కార్యాలయంలో ప్రజల వినతుల స్వీకరణ
- శుభకార్యాల ఆహ్వాన పత్రికలు అందజేసిన స్థానికులు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ హ్యాట్రిక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ ముందుకు సాగుతున్నారు. దండమూడి కాలనీలోని తన నివాస కార్యాలయంలో ప్రతిరోజూ తనను కలిసేందుకు వచ్చే స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు, విజ్ఞప్తులను స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం కూడా పలువురు స్థానికులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు వివరించిన సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటూ సంబంధిత అంశాలపై దృష్టి సారించారు. అదేవిధంగా, వివిధ శుభకార్యాలు, కుటుంబ వేడుకలు, ఇతర కార్యక్రమాలకు సంబంధించి స్థానికులు అందించిన ఆహ్వాన పత్రికలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా వారితో ఆత్మీయంగా ముచ్చటిస్తూ, ప్రజలతో తనకున్న అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం, వారి సుఖదుఃఖాల్లో భాగస్వామ్యం కావడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల



పరిష్కారానికి కృషి చేయడం తన ప్రజాసేవలో కీలక భాగమని ఎమ్మెల్యే తన ఆచరణ ద్వారా చాటిచెబుతున్నారు. ప్రజలే కుటుంబంగా భావిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, ఆత్మీయతకు మరియు ప్రజాసేవకు ప్రాధాన్యమిస్తూ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రజలతో తన అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు.

కాలనీ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 15, : 9వ ఫేజ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, నివాసితుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గ సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. కాలనీ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సభ్యులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా చెల్లుబోయిన రమేష్, ఉపాధ్యక్షులుగా బ్రిజేష్, వెంకటరత్నం, వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా రాంగోపాల్, విజయ్ కుమార్ రాజు, సీతారామరాజు, న్యాయ సలహాదారుగా మీనాక్షి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా హనుమంతరావు, కోశాధికారిగా బ్రహ్మారెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా వెంకట్ రాజు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా విశాలి, రమణ, కృష్ణారెడ్డి, ప్రసాద్ నాయక్, జి. శ్రీనివాస్, చంద్రమౌళి, ఎస్. శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

- యువత కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని బాచుపల్లి పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో మహమ్మద్ సలీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించిన కలాం తన అసాధారణ ప్రతిభ, కఠోర శ్రమ,



అంకితభావంతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించి కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ముఖ్యంగా యువత పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని కలాం ఇచ్చిన సందేశం నేటికీ ఎంతో ప్రాసంగికమని తెలిపారు. దేశ రక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి డాక్టర్ కలాం అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, విద్యార్థులు, యువత విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ మాజీ కార్పొరేటర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద, బోరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాలరెడ్డి, కొంపల్లి మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, గాజుల సుజాత, కోఆప్షన్ సభ్యుడు చంద్రగిరి సతీష్, నాయకులు సాంబశివరెడ్డి, ఖాదరయ్య, భిక్షపతి, చంద్రయ్య, ప్రవీణ్, విద్యాసాగర్, రియాజ్, సుకన్య, సువర్ణ, ఎస్.వి. సురేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు రమేష్, తిరుపతి, మోహన్, సురేష్, కృష్ణ, చోటు, సోహైల్, ఫజల్, పర్వేజ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

తహసీల్దార్ శ్రీనివాసరావు

నూతనకల్, అక్టోబర్ 15, :

అడిషనల్ కలెక్టర్ స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా నూతనకల్ లోని పోలింగ్ కేంద్రములు 166 నుండి 171లను పరిశీలించారు. వచ్చిన క్లైములు అభ్యంతరాలను స్వీకరించి వాటిని ఎన్నికల నియమావళి ప్రకారం పూర్తి చేయుటకు ఆదేశించినారు. అందరూ ఓటర్లు కూడా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయవలెనని తెలియజేసినారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఫారం 18 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు విచారణ ఎన్నికల సంఘం ఆదేశముల మేరకు పూర్తి చేయుటకు తెలిపినారు. మండలంలోని అందరూ పట్టభద్రులు కూడా ఫారం 18 ద్వారా తేదీ 06.11.2026 లోపు ఓటు నమోదు చేసుకొనుటకు సూచించినారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున, బీజేపీ జిల్లా నాయకులు కాప రవి కుమార్, అధికారులు, బిల్ఓలు పాల్గొన్నారు.



నవజీవన్ నగర్‌లో ఘనంగా నవరాత్రి పూజలు



- మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్

కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 15, :

బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్‌లో ఉన్న లక్షి విజయ గణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రావు ఆహ్వానం మేరకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ గురువారం ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మహిళల సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు. నవరాత్రి పర్వదినాల సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూసుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని బండి రమేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొండకింది పుష్ప రెడ్డి, తూము సంతోష్, మధుమోహన్, జిల్లా శివకుమార్, సప్పిడి భాస్కర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ పోటీలకు అబ్జర్వర్ గా రాజమల్లయ్య నియామకం



చొప్పదండి/కొడిమ్యాల, అక్టోబర్15, :

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న బూట్ల రాజ మల్లయ్యను నియమిస్తూ ఎస్జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ. ఉషారాణి ఆర్సీ నంబర్ ఆర్/4/ఎస్.జి.ఎఫ్ టీజీ ఈ నెల 12 న ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియం ఆవరణలోని లాన్ టెన్నిస్ కోర్టులో నిర్వహించే అండర్ 17 బాలబాలికల జట్ల టోర్నమెంట్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ అబ్జర్వర్ గా నియామకమైన సందర్భంగా రాజమల్లయ్య గురువారం మాట్లాడుతూ హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం నుండి శనివారం వరకు ఎస్ జి ఎఫ్ అండర్–17 బాలబాలికలకు లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 24 ఏళ్ళ తన సర్వీస్ లో తొలిసారిగా తాను రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ లాన్ టెన్నిస్ పోటీలకు అబ్జర్వర్ గా నియామకమైనట్లు తెలిపారు. తనను అబ్జర్వర్గా నియమించిన ఎస్జీఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ .ఉషారాణికి, తన నియామకానికి సహకరించిన ఎస్జీఎఫ్ సెక్రటరీలు వాసుదేవరావు , చక్రధర్ రావులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిఈఓ కె. రాము, డీవైఎస్ఓ డాక్టర్ రవికుమార్, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ , కొడిమ్యాల సర్పంచ్ జీవన్ రెడ్డి, జెడ్పీహెచ్ఎస్ కొడిమ్యాల హెచ్ఎం విజయేంద్ర, ఉపాధ్యాయ బృందం, పలువురు పిడిలు రాజమల్లయ్యను అభినందించారు.

ప్రజల సహకారం,భగవంతుని కృపతో నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్




జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 15, :

జగిత్యాల పట్టణంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శ్రీ దుర్గా గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో గాయత్రి మాత ఆలయంలో మహా దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో జయ దుర్గా సేవా సమితి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో భగవంతుని కృపతో, ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. ఎల్నినో ప్రభావం ఉన్నప్పటికీ సమృద్ధిగా వర్షాలు కురవడంతో ప్రస్తుతం పంటలు చేతికి వచ్చే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఎల్నినో తీవ్రత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. భగవంతుని కృపతో రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారి సమృద్ధిగా వర్షాలు కురవాలని, ఎండ తీవ్రత తగ్గి డిసెంబర్ వరకు చల్లటి వాతావరణం కొనసాగాలని ఆకాంక్షించారు. వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, పాక్స్ చైర్మెన్ కొలుగూరి దామోదర్ రావు, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, సమిండ్ల శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్,కౌన్సిలర్లు చెట్టే గంగాధర్, దయల చంద్రకళ శంకర్, అరవ లక్ష్మీ రాజు, చీటి లక్ష్మీనారాయణ, బాల ముకుందం, నక్కల రవీందర్ రెడ్డి, నాయకులు శరత్ రావు, గంగాధర్, సుశీల్, జిల్లా యూత్ ఉప అధ్యక్షులు సాయి తదితరులు పాల్గొన్నారు.

సత్తు మహేందర్ రెడ్డి దశదిన కార్యక్రమానికి మెదక్ ఎంపీ

పిల్లల చదువు బాధ్యత తీసుకున్న ఎంపీ



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 15, :

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో చెల్లాపూర్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బూత్ అధ్యక్షుడు సత్తు మహేందర్ రెడ్డి దశదిన కార్యక్రమంలో గురువారం మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పాల్గొన్నారు. మహేందర్ రెడ్డి మరణం పార్టీకి తీరనీ లోటని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడే వారికి సముచిత న్యాయం చేకూరుతుందన్నారు. వారి పిల్లల ఉన్నత చదువుల బాధ్యత తను భరిస్తానని వారి కూతురి పేరు పైన పోస్టాఫీసులో ఫిక్స్డ్ డిపాజిట్ చేసి రెండు రోజుల్లో బాండ్ అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయ రాజశేఖర్, దిశా బోర్డు నెంబర్ సుంకోజి ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు కృష్ణంగారి రమేష్ రెడ్డి, పల్లె నిహాల్ గౌడ్, కారం కట్టి రాజు, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో భక్తిపారవశ్యం.. వైభవంగా అమ్మవారి బోనాల ఊరేగింపు..

- **డప్పు చప్పుళ్లు.. బైండ్ల నృత్యాలు.. దుర్గామాత వేషధారణ ప్రత్యేక ఆకర్షణ..**
- **దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన మహిళలు**



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 15, :

డప్పు చప్పుళ్లు.. బైండ్ల నృత్యాలు.. మహిళల బోనాల సందడి.. శివశక్తుల పూనకాలు.. దుర్గామాత వేషధారణతో దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నిర్వహించిన అమ్మవారి బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపు దేవి మండపం వరకు కొనసాగింది. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఊరేగింపులో డప్పు చప్పుళ్లు, బైండ్ల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుర్గామాత వేషధారణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ప్రతి సంవత్సరం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ భక్తిభావాన్ని పెంపొందిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామ ప్రజలను ఏకతాటిపైకి తీసుకు రావడంతో పాటు, సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. అమ్మవారి బోనాల ఊరేగింపులో మహిళలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో తిమ్మాపూర్ గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

బొరంపేట్ డివిజన్‌లో బీజేపీలోకి 100 మందికి పైగా చేరికలు

- **ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో కాషాయ కండువాలు కప్పుకున్న వివిధ కాలనీలకు చెందిన నేతలు, స్థానికులు**



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, : 295 బొరంపేట్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన పలువురు నాయకులు, స్థానికులు భారతీయ జనతా పార్టీలో చేరారు. బుధవారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సమక్షంలో 100 మందికి పైగా పార్టీ కండువాలు కప్పుకుని బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడు ఈవీఎంల ట్యాంపరింగ్ అంశాన్ని తెరపైకి తీసుకువస్తోందని విమర్శించారు. ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ వైఖరిని ఆయన ప్రశ్నించారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ బీజేపీకి ప్రజల మద్దతు లభించిందని అన్నారు. తెలంగాణలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లోనూ బీజేపీకి ప్రజల మద్దతు పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఈటల రాజేందర్ విమర్శించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎన్ని కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా, బల్దియా ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పలువురు బీజేపీ నేతల హాజరు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డి. గిరివర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎస్. జంగారెడ్డి, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు దాసరి శ్యామ్ రావు, జిల్లా మాజీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, మాజీ ఎంసీఐ బోర్డు సభ్యుడు పి. శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శేఖర్ యాదవ్, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు ఎం. వెంకటేష్ నాయక్, మాజీ కౌన్సిలర్ ఎంబరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు డి. ప్రభాకర్ రెడ్డి, ఆర్. నర్సింహాచారి, సర్కిల్ పరిధిలోని డివిజన్ అధ్యక్షులు ఏ. శ్రీనివాస్ యాదవ్, ఆకుల విజయ్, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. నర్సింగ్ రావు, యువ నాయకులు ఎం. అతీష్ బాబు, సార నవీన్ కుమార్, గణేష్ ముదిరాజ్, బాలగారి శ్రీకాంత్, విజయ్ భాస్కర్ రెడ్డి, దుర్గావిహార్ నవీన్ తదితరులు హాజరయ్యారు. వివిధ కాలనీల నుంచి చేరికలు బీజేపీలో చేరిన వారిలో సారెగూడెం, కర్రోల, ప్రణీత్ ఫ్లోరా, శ్రీరామ్ నగర్, సింహపురి కాలనీ, మల్లంపేట్ తదితర ప్రాంతాలకు చెందిన నాయకులు, స్థానికులు ఉన్నారు. మహేష్, ప్రవీణ్, వెంకట్ కుమార్ రెడ్డి, రాఘవేంద్ర గుట్టుల, ప్రవీణ్ జెట్టి, భాస్కర్ రాయుడు, శ్రీహరి గుట్టుల, విజయ్ బాగానే, భరత్ కుమార్ రెడ్డి తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వివిధ కాలనీలకు చెందిన 100 మందికి పైగా బీజేపీలో చేరడంతో బొరంపేట్ డివిజన్‌లో పార్టీ కార్యకలాపాలకు మరింత ఊపునిచ్చే ప్రయత్నం చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

సాయి నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం

- **ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం**
- **కొలన్ హన్మంత్ రెడ్డి**




కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 15, :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రగతి నగర్ 276వ డివిజన్ పరిధిలోని సాయి నగర్ ఆలయ ప్రాంతంలో సిఎంసీ నిధులు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. కాలనీల అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుప రచడం, కాలనీలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధా న్యతనిస్తూ ముందుకు సాగుతామని హన్మంత్ రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. దేశ యువతకు స్ఫూర్తిగా నిలిచిన కలాం సేవలను, శాస్త్ర సాంకేతిక రంగంలో, దేశాభివృద్ధిలో ఆయన అందించిన విశిష్ట కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, 276వ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, 277వ డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలేటి శ్రీనివాస్, గజ్జెల కాంతం, కూతురు నిర్మల, ప్రవీణ్ (లడ్డు), మల్లికార్జున్, శ్రీ నవీన్ రెడ్డి, వీరబాబు, సురేందర్ యాదవ్, పిల్లి ఆంజనేయులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

చిత్రహింసలకు గురైన జర్నలిస్టులకు టిఆర్ఎస్ పరామర్శ

- **బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **బాధితులకు మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలి**
- **టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్**



కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15, :


రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైన విలేకరులు పొత్తూరి శేఖర్, రాతిపల్లి సంపత్‌లు ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి క్రిటికల్ కేర్ విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు కవితమ్మ ఆదేశాల మేరకు గురువారం తెలంగాణ రక్షణ సేన, టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆసుపత్రికి వెళ్లి బాధిత జర్నలిస్టులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను భయపెట్టడం, బెదిరించడం, దాడులకు పాల్పడడం ఏ పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన వ్యవస్థలే ప్రజల గొంతుకగా నిలిచే జర్నలిస్టులపై దాడులకు పాల్పడితే సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందని చట్టాన్ని కాపాడాల్సిన వారే చట్టాన్ని ఉల్లంఘించడం తీవ్రమైన విషయం. ఈ ఘటనను ప్రభుత్వం తేలికగా తీసుకోకూడదు. బాధితులకు న్యాయం జరిగే వరకు జర్నలిస్టులకు అండగా టిఆర్ఎస్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పిన్నింటి సంగీత రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్, జిల్లా నాయకులు శ్రీరాముల రమేష్, మ్యాకల తిరుపతి, బసవేణి రాజేందర్, మడిపల్లి వినీత్, చిట్టంపల్లి నాగరాజు, పల్లె శారద, కొత్తూరి రఘు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు సాహిత్యంపై తెన్నేటి చెరగని సంతకం

నేడు తెన్నేటి సూరి వర్ధంతి

తెలుగులో ప్రముఖ కవులు, రచయితలలో ఒకరు తెన్నేటి సూరి. అభ్యుదయ కవి. నవలాకారుడు, అనువాదకుడు. తన భావజాలాన్ని ఆవిష్కరించడానికి ఆయన... కథ, వ్యాసం, కవిత, గేయం, నాటకం, నవల, అన్ని సాహిత్య ప్రక్రియలను ప్రజల గుండె తలుపులను తట్టే సాధనాలుగా వాడుకున్నాడాయన. అలనాటి మేటి పత్రికలు భారతి, ఆంధ్ర పత్రికల సహాయ సంపాదకునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే తన సాహితీ క్షేత్రం సుసంపన్నం చేయ గలిగిగారు. తెన్నేటి సూరి పేరుతో మొట్టమొదట స్ఫురించేది ఆయన చారిత్రక నవల...ఛంఘిజ్‌ఖాన్. 12, 13 శతాబ్దాలలో మంగోల్‌లో జన్మస్థలంగా, ఎడారిలో ఒక మహా సామ్రాజ్యాన్నే నిర్మించిన విజేత చంఘిజ్‌ఖాన్. అది కత్తి మీద సాములాంటి రచనలో చరిత్రలో జరిగిన సంఘటనలను వక్రీకరించకుండా, హెన్రీ హౌవర్త్ దంపతులు రచించిన మంగోల్ చరిత్రను ఆధారంగా చేసుకొని, లోతుగా అధ్యయనం చేసి, చేయి తిరిగిన నవలాకారునిగా అద్భుత రచనతనదైన శైలిలో రచించారు. ఆ ప్రచురణ విశేష ప్రజాదరణ పొందింది. తెన్నేటి సూరి చెంఘిజ్ ఖాన్ తొలిగా ఆంధ్రపత్రిక, 1950 సెప్టెంబరు నుంచి ధారావాహికంగా ప్రచురింప బడింది. సెప్టెంబరు 1998) రేడియో నాటకంగా శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అనుసరించి ప్రసారం చేశారు. ఆంధ్ర పత్రికలో ఆయన వ్రాసిన ధారావాహికను నవలా రూపంలో విశాలాంధ్ర వారు ప్రచురించగా, 1956 లో ప్రచురించబడిన ఒక నవల ఎనిమిది పునర్ముద్రణలు జరుపుకోవడం రచయిత గొప్పతనమే. తెన్నేటి సూరి (1911 - 1958 అక్టోబరు 16) తెలుగు రచయిత. అభ్యుదయ కవి, కథారచయిత, నాటకకర్త. ఛంఘిజ్ ఖాన్ నవలా రచయితగా సుప్రసిద్ధుడు. భారతి, ఆంధ్ర పత్రికలలో 1945-1957లలో పత్రికా రచయితగా పనిచేశాడు. సూరి 1911లో కృష్ణా జిల్లా తెన్నేరులో వెంకట లక్ష్మమ్మ, తండ్రి తిరుమలరావు దంపతులకు జన్మించాడు. పుట్టిన ఊళ్లోనే ప్రాథమిక విద్య పూర్తిచేసి, పై చదువులకి బందరు వెళ్లాడు. అక్కడే సాహిత్య రచనా వ్యాసంగానికి అంకురార్పణ జరిగింది. కొందరు పత్రికాధిపతులతో పరిచయం ఏర్పడింది. వారి మద్దతుతో ఓ ప్రెస్‌లో ఉగ్యోగం లభించింది. 1940 దశకంలో స్వాతంత్ర ఉద్యమం వువ్వెత్తున ఎగసిపడుతున్న సమయంలో , తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనలో, భుస్వామ్య వ్యవస్థలో, అణచివేతల నేపథ్యంలో చెలరేగిన రైతాంగ పోరాటం చోటు చేసుకున్న తరుణంలో , తన సొంత ఇంట్లో అందరూ కాంగ్రెస్ వాదులుగానే ఉన్నా, నిరంకుశత్వం ఎక్కడ ఉన్నా దానికి వ్యతిరేకంగా తన కలాన్ని ఝళిపించడం తక్షణ కర్తవ్యమని భావించారయన. ఇతర పత్రికల రచనలకు భిన్నంగా, తమ కుటుంబ సభ్యుల అభీష్టానికి వ్యతిరేకంగా రచన ప్రారంభించాడు. తాను పనిచేసే ప్రెస్సే ఒక సాహిత్య వేదికగా, ఒక చర్చా వేదికగా మలుచు కున్నారు. ప్రెస్ లో పని చేస్తూనే ఆయా పత్రికలకి వ్యాసాలు రాయడం మొదలు పెట్టాడు. పనిచేసే ప్రెస్సే సాహిత్య వేదికగా, కార్మిక కర్షక కూడలిగా మారింది. మహిళా చైతనం కోసం పాటలు రాసాడు. ఫాసిజాన్ని ఖండించాడు. పిల్లల కోసం వారి బాణీల్లో పాటలు, బాల గేయాల రాసేవాడు. "గొడ్లకాడ" అనే నాటకం కూడా రాసి ప్రదర్శించాడు. తెలంగాణ రైతాంగ పోరాటం గురించి ఆంధ్ర ప్రాంతంలో సానుభూతి సంపాదించడం కోసం పాటలు రాసాడు. పని చేస్తున్న ప్రెస్సు మూత పడ్డాక ఆంధ్రపత్రికలో చేరాడు. రచయితగా మన్ననలను పొందాడు. ఆంధ్ర పత్రిక సారస్వతాను బంధం సంపాదక బాధ్యతలు సమర్థ వంతంగా నిర్వహించాడు. ప్రజానాట్య మండలికి ఎన్నో పాటలు రాసి వారికి అందించగా, సూరి రాసిన పాటల్ని బుర్రకథల్లో, ఇతర ప్రదర్శన కళారూపాల్లో ఉపయోగించి, కళాకారులు ఎన్నో పాటలు, కళారూపాల ద్వారా ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం చేశారు. సూరి తెలంగాణ రైతాంగ పోరాటంలో ఎంతో ప్రభావితుడయ్యాడు. కలంతోనే కాకుండా గళంతో పాడే పాటల రచయితగా తెలంగాణ పోరాటానికి నోటి పాటలను కంపోజ్ చేసేవాడు. ఆంధ్ర పత్రిక నైజాంలోకి ప్రవేశించేది కాదు. కానీ నోటి పాటలు నిరాఘాటంగా వెళ్ళి వ్యాప్తి పొందేవి. ఆయన పాటలు ప్రజల నోళ్ళలో చిరకాలం నిలిచాయి. సూరి 1958, అక్టోబరు 16న ఈ లోకాన్ని వదిలి వెళ్ళినా, ఆయన పాడిన పాటలు, కూర్చిన బాణీలు నిత్య ఆయన్ని సజీవంగా ఉంచాయి.



వైద్య శాస్త్రంలో అద్భుతం అనస్థీషియా ఆవిష్కరణ

నేడు ప్రపంచ అనస్థీషియా దినోత్సవం



ప్రపంచ అనస్థీషియా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 16న నిర్వహించ బడుతుంది. తొలిసారిగా అనస్థీషియా (మత్తుమందు) ఇచ్చి శస్త్రచికిత్స చేసిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ అనస్థీషి యాలజిస్టుల సంఘం ద్వారా ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్16 న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఆఫ్ అనస్థీషియాల జిస్టుల ద్వారా ప్రతి సంవత్సరం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని జరుపుకునే క్రమంలో 150 కంటే ఎక్కువ దేశాల నుండి అనస్థీషియా లజిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 134 కంటే ఎక్కువ సంఘాలు పాల్గొంటాయి. పూర్వకాలంలో శస్త్ర చికిత్స అనంతరం పుట్టే నొప్పిని తగ్గించేదిగా ఆల్కహాల్ (మదిర) ను గుర్తించి శస్త్ర చికిత్స చేయించుకునే రోగికి ...6వ శతాబ్దానికి చెందిన ఆయుర్వేదానికి చెందిన శస్త్ర చికిత్సకుడు, అపర ధన్వంతరి సుశ్రుతుడు సురాపానం చేయించే వాడు. భరించలేని చాలా నొప్పికి ఉప శమనంగా వైద్యులు, నర్సులు కాకుండా ఇతర మనుషులు గట్టిగా పట్టుకుంటే శస్త్ర చికిత్స చేసేవారు. అమెరికాలోని మసెచ్యూసెట్ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16వ తేదీన విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు గిల్బర్ట్ అబోట్ అనే రోగిపై ఈథర్ వాయువును ప్రయోగించారు.

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసాచుసెట్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16న గిల్బర్ట్ అంబార్టు గొంతుకు శస్త్రచికిత్స చేసేందుకు... విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు ప్రముఖ దంత వైద్యుడు జాన్‌కొలిన్స్‌తో కలిసి ఈథర్ మత్తు మందు ఇవ్వగా, హార్వర్డ్ మెడికల్ స్కూల్ మొదటి డీన్ అయిన జాన్ కాలిన్స్ వారెన్, అబాట్ మెడలోని కణితి భాగాన్ని నొప్పిలేకుండా తొలగించగా, అలా దిగ్విజయంగా ఆపరేషన్ చేశారు. ఈథర్. సల్ఫూరిక్ యాసిడ్, ఆల్కహాల్ మిశ్రమాన్ని సంశ్లేషణను ఇందుకు ఉపయోగించారు. 1860ల నాటికి మత్తు మందు విస్తృతంగా వాడకంలోకి వచ్చింది. 1860ల్లో యాంటీ సెప్టిక్ పద్ధతుల కనిపెట్టిన తర్వాత ఆపరేషన్లు మరింత సులువుగా మారాయి ఈ పరిణామం వైద్యశాస్త్రంలో అద్భుతం ఆవిష్కరించడమే గాకుండా మత్తు వైద్య విభాగంలో విప్లవాత్మ కమైన మార్పులకు నాంది పలికింది. ఇది వైద్య చరిత్రలోని అత్యంత ముఖ్యమైన సంఘటనలలో ఒకటిగా నిలిచి పోయింది. ఆ విజయాన్ని పురస్కరించుకుని అప్పటి నుంచి ఏటా అదే రోజున ప్రపంచ అనస్థీషియా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. సాధారణ మత్తు (అనస్థీషియా) ను నియంత్రితంగా స్పృహను కోల్పోయేలా చెయ్యడానికి ఉపయోగిస్తారు, దీనిని శస్త్రచికిత్సలు నిర్వహించవలసిన అవసరం ఉన్నపుడు ఉపయోగిస్తారు. అనస్థీషియా వైద్య ప్రయోజనాల కోసం ఇవ్వబడేది, ఇది తాత్కా లికంగా స్పర్శను అలాగే స్పృహను కోల్పోయేలా చేస్తుంది. ఆపరేషన్ సమయంలో అనస్థీషియా ఉపయోగించడం వల్ల రోగి నిద్రాణ స్థితిలో ఉంటాడు. నరాల ద్వారా సంకేతాలు బదిలీకావడాన్ని అనస్తీటిక్స్ నిరోధిస్తాయి, తద్వారా మెదడు నొప్పిని గుర్తించే అనుభూతిని నిరోధిస్తాయి. ఆపరేషన్ సమయం, శరీర భాగం, వైద్య పరిస్థితి, రోగి వయస్సు తదితరాలను బట్టి మత్తు ఇచ్చే విధానాన్ని ఎంపిక చేసుకుంటారు. సాధారణ అనస్థీషియాలో... రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు, ఏమీ అనుభూతి చెందరు. స్థానిక అనస్థీషి యాలో... రోగి శస్త్రచికిత్స సమయంలో మెలకువగా ఉంటాడు, నిర్ణీత ప్రాంతాన్ని తిమ్మిరి చేయడానికి మందులు ఇంజెక్ట్ చేయ బడతాయి. ప్రాంతీయ అనస్థీషియాలో... రోగులు మేల్కొని ఉంటారు. శరీర భాగాలు తిమ్మిరిగా ఉంటాయి. మానిటర్డ్ అనస్థీషియా కేర్ అనేది స్థానిక అనస్థీషియాతో పాటు మత్తు, అనల్జీసియాతో పాటుగా డయాగ్నస్టిక్ లేదా థెరప్యూటిక్ విధానాల కోసం సురక్షితమైన విధానంగా మత్తు, రోగి యొక్క ఆందోళనను తగ్గించే చర్యలు, సమ-ర్థవంత మైన నొప్పి నియంత్రణకు ఉపకరిస్తుంది. బాయల్స్ అనే అనస్థీషియా మిషన్ కనిపెట్ట బడ్డాక, ఈ మిషన్ అనస్థీషియా విభాగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకు వచ్చింది. దీని ద్వారా ఏకకాలంలో ఒకటి కంటే ఎక్కువ అనస్థీషియా వాయువులను నిర్దిష్టమైన ప్రమాణంలో రోగి శరీరంలోకి పంపించడానికి అవకాశం ఉంటుంది. మత్తుమందు డాక్టర్లు ఉపయోగించే అనేక పరికరాలు రోగి పల్స్, బీపీ, ఆక్సిజన్ స్థాయిలు, కార్బన్‌డైయాక్సైడ్లలను నిరంతరం పర్యవేక్షించడానికి సాయం చేస్తున్నాయి.

రోగులకు ఆపరేషన్లు నిర్వహించడంలో అనస్థీషియా వైద్యులే కీలక పాత్ర పోషిస్తారు. చిన్న శస్త్ర చికిత్సలు మొదలు కొని అతి క్లిష్టమైన మెదడు, గుండె, ఊపిరి తిత్తులు, కాలేయం, మూత్ర పిండాలు, అవయవాల మార్పిడి, కీళ్ల మార్పిడిని సునాయసంగా చేస్తున్నారు. అంటే ఐసీయూ, ప్రకృతి వైపరీత్యాలు, దీర్ఘకాలిక నొప్పుల నివారణలోనూ అనస్థీషియా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. రోగులకు శస్త్ర చికిత్సకు ముందు సంరక్షణకు అనస్థీటిస్టులు బాధ్యత వహిస్తారు. ఆపరేషన్ థియేటర్లలో రోగికి మత్తు ఇవ్వడమే గాక అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస అందించడం, ఆఖరి క్షణాల్లో రోగులకు శ్వాస, రక్త ప్రసరణ పునరుద్ధరించడం లో మత్తు వైద్యసేవలు ప్రధాన భూమిక పోషించడం ద్వారా క్రిటికల్ కేర్ విభాగంలో కీలకంగా మారింది. ప్రమాదాలు సంభవిం చి నప్పుడు ట్రామాకేర్ లోనూ, ప్రకృతి విలయాల్లోనూ, మాస్ క్యాజువాలిటిల్లో ముఖ్య భూమిక పోషించడం ద్వారా వైద్యరంగంలో అనస్థీషియా వైద్యులు కీలకంగా మారారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

కనుమరుగవుతున్న సంప్రదాయాలు.. తెరమరుగవుతున్న సనాతన ఆచారాలు!

- మూగబోతున్న మహిళల గళాలు.. మాయమవుతున్న పూలవనాలు!
- తెలంగాణ బతుకమ్మ సంబరాల్లో మారుతున్న పండుగ స్వరూపం..
- కనుమరుగవుతున్న సంప్రదాయాలు.. తెరమరుగవుతున్న సనాతన ఆచారాలు!: బతుకమ్మ వేడుకల్లో మారుతున్న పండుగ స్వరూపం!



తెలంగాణ నేల ప్రకృతిని సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపంగా దర్శించి, పూలనే దేవతలుగా కొలిచే అపురూప సాంస్కృతిక



జీవన సౌందర్యం బతుకమ్మ పండుగ. స్త్రీత్వంలోని నైసర్గిక సృజనాత్మకతను, శ్రమజీవుల వేదనను, కుటుంబ అనుబంధాల మాధుర్యాన్ని, సమాజ సమష్టి చైతన్యాన్ని ఏకసూత్రంతో బంధించే ఈ మహోత్సవ మౌలిక ఆత్మ కాలక్రమేణా మారుతోంది. వినియోగ సంస్కృతి పెంచిన కృత్రిమ జాడ్యాలు, ఆడంబరాల వెనుక పరుగెత్తే యాంత్రిక జీవనం వల్ల వేడుకలోని సనాతన సంప్రదాయాలు క్రమంగా తెరమరుగవుతున్నాయి. చారిత్రక ధర్మపురి పుణ్యక్షేత్రం మొదలుకొని పల్లెలు, పట్టణాలు, నగరాల వరకు నేడు చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే, సాంస్కృతిక అస్తిత్వ పరిరక్షణ ఎంతో ప్రధానమైన సవాలుగా మారిందని స్పష్టమవుతోంది. గతంలో ధర్మపురి గోదావరి పరివాహక ప్రాంతాలైనా, గ్రామీణ బీడు భూములైనా పల్లెజనం స్వయంగా వెళ్లి పసుపు వర్ణపు తంగేడు, తెల్లని గునుగు, కాట్లకుక్క, గుమ్మడి, రుద్రాక్ష, సీతమ్మజడలు, కట్లపూలు, బంతి, చేమంతులను కోసుకొచ్చేవారు. ఈ పూల సేకరణ ప్రకృతి విజ్ఞానాన్ని నేర్పే నిగూఢ పాఠశాలగా నిలిచేది. తొమ్మిది రోజుల పాటు ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు సమర్పించే నైవేద్యాలు రుతుమార్పుల వల్ల వచ్చే రుగ్మతలను హరించే ఆయుర్వేద పోషకాహారాలుగా ఉపయోగపడేవి. సాయంత్ర వేళల్లో నదీతీరాల్లో, రచ్చబండల వద్ద మహిళలు లయాత్మక వలయాలుగా తిరుగుతూ పౌరాణిక, సామాజిక అంశాలతో కూడిన జానపద గేయాలను ఆలపించేవారు. నీటిలోకి జారిన తంగేడు, గునుగు వంటి ఔషధ పుష్పాలు జలాశయాలను పరిశుద్ధం చేసేవి. అయితే గత రెండు దశాబ్దాలుగా ప్రబలిన తీవ్ర వినియోగతత్వం వల్ల పండుగ నిర్వహణ రూపురేఖలు మారాయి. సహజ పూలకు బదులుగా ప్లాస్టిక్, వెల్వెట్, థర్మాకోల్‌తో తయారుచేసిన కృత్రిమ బతుకమ్మలు మార్కెట్లలో విస్తృతంగా ప్రవేశించాయి. తరతరాల జానపద గీతాల స్థానాన్ని విపరీతమైన డీజేల హోరు, కర్ణకఠోర సౌండ్ సిస్టమ్స్ ఆక్రమించాయి. శబ్ద కాలుష్యంతో మహిళల మధుర కంఠస్వరాలు, లయాత్మక చప్పట్ల ధ్వనులు ఆనవాలు లేకుండా పోతున్నాయి. ఈ సాంస్కృతిక సంక్షోభాన్ని అధిగమించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో సంప్రదాయ పాటల సాహిత్యంపై ప్రత్యేక కార్యశాలలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. పండుగ ప్రాంతాల్లో డీజేల మోతపై ఆంక్షలు విధించి, ప్లాస్టిక్ బతుకమ్మల స్థానంలో సహజ పూల వినియోగాన్ని ప్రోత్సహించాలి. స్వచ్ఛమైన తంగేడు పరిమళాలు, ఆర్తితో కూడిన మహిళల గళాల జానపద నాదం, పవిత్ర జలాలను శుద్ధిచేసే సహజ నిమజ్జనం తిరిగి పరిఢవిల్లినప్పుడే తెలంగాణ బతుకమ్మ పండుగకు అసలైన వైభవం, సార్థకత చేకూరుతాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



కోహ్లీకి సత్య నాదెళ్ల స్వాగతం!

న్యూఢిల్లీ, అక్టోబరు 15 : టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రముఖ వృత్తిపరమైన నెట్‌వర్కింగ్ వేదిక లింక్డిన్‌లో అడుగుపెట్టాడు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. కోహ్లీ తొలి పోస్టుపై స్పందించిన నాదెళ్ల.. ఆయన కొత్త వ్యాపార ప్రయాణానికి అభినందనలు తెలిపారు. కోహ్లీ లింక్డిన్‌లోకి రావడంతో తన ఫీడ్ మరింత ఆసక్తికరంగా మారిందని పేర్కొన్నారు. లింక్డిన్‌లో తన తొలి పోస్టు ద్వారా కోహ్లీ భారత క్రీడలకు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకురావాలన్న ఆకాంక్షను వెల్లడించాడు. దేశంలో క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలకూ ఆదరణ పెరగాలని, భారతీయ బ్రాండ్లు అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాలని అభిప్రాయపడ్డాడు. ఈ లక్ష్యంతోనే వ్యాపార రంగంలోనూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపాడు. కోహ్లీ 'అగిలిటాస్ స్పోర్ట్స్'లో పెట్టుబడిదారుడిగా, 'వన్8వరల్డ్'లో సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరిస్తున్నాడు. క్రీడలతో తనకున్న అనుబంధాన్ని వ్యాపార రంగంలోనూ విస్తరించుకుంటూ భారతీయ క్రీడా సంస్కృతికి, దేశీయ బ్రాండ్లకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాడు. నాదెళ్ల నుంచి వచ్చిన అభినందనలు ఈ కొత్త ప్రయాణానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చాయి. లింక్డిన్‌లో కోహ్లీ ప్రవేశానికి అభిమానులు, నెటిజన్ల నుంచి విశేష స్పందన లభించింది. ఖాతా ప్రారంభించిన తొలి 24 గంటల్లోనే ఆయన అనుచరుల సంఖ్య 2.4 లక్షలు దాటినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. మైదానంలో తన బ్యాటింగ్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న కోహ్లీ.. ఇప్పుడు వ్యాపార రంగంలోనూ తన ఆలోచనలు, లక్ష్యాలను పంచుకుంటూ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు.



స్మృతి మంధాన ముందు ప్రపంచ రికార్డు!

న్యూఢిల్లీ, అక్టోబరు 15 : భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు కెప్టెన్‌గా తొలి సవాల్ ఎదురుకానుంది. భారత్, జింబాబ్వే మహిళల జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ అక్టోబరు 16 నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో పూర్తిస్థాయి సారథిగా బరిలోకి దిగనున్న మంధాన.. తొలి మ్యాచ్‌లోనే జట్టుకు విజయాన్ని అందించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు, ఈ సిరీస్‌లో ఆమె ముందు అరుదైన ప్రపంచ రికార్డు కూడా ఉంది.

మరో 133 పరుగులు చేస్తే చరిత్ర!

అంతర్జాతీయ మహిళల టీ20 క్రికెట్‌లో 5,000 పరుగుల మైలురాయిని చేరుకోవడానికి స్మృతి మంధానకు మరో 133 పరుగులు అవసరం. ఈ లక్ష్యాన్ని చేరుకుంటే అంతర్జాతీయ మహిళల టీ20ల్లో 5,000 పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా ఆమె చరిత్ర సృష్టించనుంది. ఇప్పటివరకు 179 మ్యాచ్‌ల్లో 4,867 పరుగులు సాధించిన మంధాన ఖాతాలో రెండు శతకాలు, 37 అర్ధశతకాలు ఉన్నాయి. ఆమె స్ట్రైక్‌రేట్ 127.5గా ఉంది. జింబాబ్వేతో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోనే ఈ ఘనత సాధించే అవకాశం ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

అత్యధిక పరుగుల జాబితాలో అగ్రస్థానానికి చేరువగా..

మహిళల అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో మంధాన ముందంజలో ఉంది. న్యూజిలాండ్ బ్యాటర్ సుజీ బేట్స్ 4,758 పరుగులతో తర్వాతి స్థానంలో ఉండగా, హర్మన్‌ప్రీత్ కౌర్ 4,327 పరుగులు, శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు 4,282 పరుగులతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ సిరీస్‌లో మంధాన తన బ్యాటింగ్ జోరును కొనసాగిస్తే 5,000 పరుగుల మైలురాయిని అందుకోవడంతో పాటు తన రికార్డును మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంది.

కెప్టెన్‌గా తొలి పరీక్ష

సారథ్య బాధ్యతలు చేపట్టిన తర్వాత మంధానకు ఈ సిరీస్ కీలకంగా మారనుంది. జట్టును ముందుండి నడిపించడంతో పాటు బ్యాటర్‌గా కూడా రాణించాల్సిన బాధ్యత ఆమెపై ఉంది. భారత్, జింబాబ్వే మధ్య మూడు టీ20 మ్యాచ్‌లు అక్టోబరు 16, 18, 20 తేదీల్లో జరగనున్నట్లు సమాచారం. ఈ మ్యాచ్‌లకు రాయ్‌పూర్ ఆతిథ్యమివ్వనుంది. తొలి మ్యాచ్‌లో విజయం సాధించడంతో పాటు వ్యక్తిగతంగా ప్రపంచ రికార్డును అందుకోవడంపై మంధాన దృష్టి సారించనుంది.

ఆసియా పతక విజేతలతో మోదీ భేటీ

- 85 పతకాలతో భారత్ సత్తా.. విజేతలకు ప్రధాని అభినందనలు
- మహిళా అథ్లెట్ల ఖాతాలో 38 పతకాలు.. 11 స్వర్ణాలు
- 44 ఏళ్ల తర్వాత మహిళల హాకీ జట్టుకు స్వర్ణం
- కొత్త ఛాంపియన్లు, రికార్డులే లక్ష్యంగా క్రీడాకారులకు పిలుపు



న్యూఢిల్లీ, అక్టోబర్ 15: అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారత యువత తమ ప్రతిభను చాటుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జపాన్‌లోని ఐచి-నగోయాలో జరిగిన ఆసియా క్రీడలు 2026లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులతో గురువారం న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో ఆయన సమావేశమయ్యారు. దేశానికి గౌరవం తీసుకొచ్చిన విజేతలను అభినందించారు. ఈసారి భారత్ మొత్తం 85 పతకాలు సాధించిందని, ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విజయాలు దేశంలో మారుతున్న క్రీడా సంస్కృతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. క్రీడాకారుల విజయాల వెనుక వారి కఠోర శ్రమతో పాటు కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా ఉందని మోదీ అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ప్రస్తావిస్తూ ఆయనకు నివాళులర్పించారు.

మహిళా అథ్లెట్ల ప్రతిభకు ప్రశంసలు

ఆసియా క్రీడల్లో భారత మహిళా క్రీడాకారులు సాధించిన విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. మొత్తం 85 పతకాల్లో మహిళా అథ్లెట్లు 38 పతకాలు సాధించారని, వాటిలో 11 స్వర్ణాలు ఉన్నాయని తెలిపారు. పతకాలు కేవలం సంఖ్యలు మాత్రమే కాదని, దేశ సామర్థ్యాన్ని చాటిచెప్పే విజయాలని పేర్కొన్నారు. గతంలో పెద్దగా పతకాలు సాధించని మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ), సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లోనూ భారత అథ్లెట్లు రాణించడం సంతోషకరమన్నారు.

హాకీ, క్రికెట్, కబడ్డీలో స్వర్ణాలు

ఆసియా క్రీడల్లో భారత మహిళలు, పురుషుల హాకీ జట్లతో పాటు రెండు క్రికెట్ జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. మహిళలు, పురుషుల కబడ్డీ జట్లు కూడా పసిడి పతకాలు గెలుచుకున్నాయి. మహిళల హాకీ జట్టు స్వర్ణం సాధించడం ద్వారా 44 ఏళ్ల నిరీక్షణకు తెరపడిందని మోదీ పేర్కొన్నారు. మహిళల హాకీ జట్టు ఫైనల్‌లో చైనాను 1-0తో ఓడించి స్వర్ణం సాధించడంతో పాటు 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. పురుషుల జట్టు ఫైనల్‌లో మలేషియాను 5-1తో ఓడించి పసిడి పతకాన్ని దక్కించుకోవడంతో పాటు ఒలింపిక్స్ బెర్తును ఖాయం చేసుకుంది. ఈ సందర్భంగా ఇరు జట్ల సభ్యులు తమ జెర్సీలను ప్రధానమంత్రికి బహూకరించారు.

కొత్త రికార్డులు సృష్టించాలని పిలుపు

భారత క్రీడా రంగాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు క్రీడాకారులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని మోదీ సూచించారు. ప్రతి మైదానంలో త్రివర్ణ పతాకానికి గౌరవం తీసుకురావడం, అంతర్జాతీయ స్థాయిలో భారత క్రీడలకు కొత్త గుర్తింపు సాధించడం, ప్రతి విభాగంలో కొత్త ఛాంపియన్లను తయారు చేయడం, సరికొత్త రికార్డులు నెలకొల్పడం వంటి లక్ష్యాలపై ప్రతిజ్ఞ చేయాలని కోరారు. విజయాలు ఒక్కరోజులో సాధ్యం కావని, వాటి కోసం ఏళ్ల తరబడి పట్టుదలతో శ్రమించాల్సి ఉంటుందని అన్నారు. గత 12 ఏళ్లుగా దేశంలో క్రీడా సంస్కృతిని బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఒకప్పుడు కొన్ని క్రీడలకు మాత్రమే పరిమితమైన భారత్.. ఇప్పుడు విభిన్న క్రీడాంశాల్లో పాల్గొంటూ పతకాలు సాధించే స్థాయికి చేరుతోందని మోదీ పేర్కొన్నారు.

అవార్డుల బరువుతో హోప్ సరదా వ్యాఖ్యలు!

హైదరాబాద్, అక్టోబరు 15 : భారత పర్యటనలో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ పరుగుల వరద పారిస్తున్నాడు. వన్డేల్లోనే కాకుండా టీ20ల్లోనూ భారత బౌలర్లకు సవాల్ విసురుతూ వరుస శతకాలతో అదరగొడుతున్నాడు. ఈ పర్యటనలో ఇప్పటికే మూడుసార్లు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు అందుకున్నాడు. వరుస విజయాలతో ఆనందంలో ఉన్న హోప్.. అవార్డులన్నింటినీ స్వదేశానికి ఎలా తీసుకెళ్లాలంటూ సరదాగా వ్యాఖ్యానించాడు.

వన్డేల్లోనూ.. టీ20ల్లోనూ శతకాల మోత

వన్డే సిరీస్‌లో భారత బౌలర్లపై విరుచుకుపడిన షాయ్ హోప్.. పొట్టి క్రికెట్‌లోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. వన్డేల్లో గువాహటిలో 104 పరుగులు, న్యూ ఛండీగఢ్‌లో అజేయంగా 162 పరుగులు చేసి తన సత్తా చాటాడు. తాజాగా టీ20 సిరీస్‌లోనూ రాంచీలో అజేయంగా 102 పరుగులు, హైదరాబాద్‌లో మరో అజేయ శతకంతో ఆకట్టుకున్నాడు. ఫార్మాట్ మారినా తన దూకుడు తగ్గదని నిరూపిస్తూ వెస్టిండీస్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.

అవార్డులన్నీ ఎలా తీసుకెళ్లాలి?

భారత్‌పై కీలక ఇన్నింగ్స్‌లు ఆడి మూడు సార్లు మ్యాచ్‌లో అత్యుత్తమ ఆటగాడి అవార్డును అందుకోవడంపై హోప్ సంతోషం వ్యక్తం చేశాడు. అదే సమయంలో అవార్డుల బరువు గురించి సరదాగా మాట్లాడాడు. స్వదేశానికి తిరిగి వెళ్లేటప్పుడు విమానాశ్రయంలో లగేజీ బరువు తనిఖీల





సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని చమత్కరించాడు. అవార్డులు గెలవడం ఆనందంగా ఉన్నా.. వాటన్నింటినీ తీసుకెళ్లడం మరో సమస్యగా మారిందన్నది అతడి వ్యాఖ్యల సారాంశం.

చివరి మ్యాచ్‌పైనా హోప్ దృష్టి

భారత పర్యటనలో బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్న హోప్.. సిరీస్‌లో తన జట్టు విజయ పరంపరను కొనసాగించాలని భావిస్తున్నాడు. కీలక సమయాల్లో పరుగులు సాధిస్తూ జట్టుకు అండగా నిలుస్తున్న అతడు, నిర్ణయాత్మక మ్యాచ్‌లోనూ ఇదే ప్రదర్శన పునరావృతం చేయాలని పట్టుదలతో ఉన్నాడు. హోప్ ఫామ్ వెస్టిండీస్‌కు బలంగా మారగా, అతడిని కట్టడి చేయడం భారత బౌలర్లకు సవాల్‌గా మారింది.

అగార్కర్ స్థానంలో కొత్త చైర్మన్ ఎవరు?

ముంబై, అక్టోబరు 15 : 2027 వన్డే ప్రపంచకప్‌కు సమయం దగ్గరపడుతున్న వేళ భారత క్రికెట్ జట్టు ఎంపికలపై బీసీసీఐ దృష్టి సారించింది. సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ స్థానంలో కొత్త వ్యక్తిని నియమించే అంశంపై కసరత్తు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ప్రపంచకప్‌కు ముందు జట్టు ఎంపిక విధానంలో పెద్దగా మార్పులు చేయకుండా ప్రస్తుత వ్యవస్థనే కొనసాగించాలని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాత్కాలిక ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రజ్ఞాన్ ఓజాను కొనసాగించే అవకాశాలపైనా చర్చ జరుగుతోంది.

ఓజా కొనసాగింపుపై ఊహాగానాలు

అగార్కర్ పదవీకాలం పొడిగింపు కోరుకోవడం లేదన్న ప్రచారం నేపథ్యంలో కొత్త ఛైర్మన్ ఎంపికపై ఆసక్తి నెలకొంది. కొత్త వ్యక్తి బాధ్యతలు చేపడితే జట్టు ఎంపికలో ఆయన అనుసరించే విధానం, నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి. ప్రపంచకప్ సన్నాహాల సమయంలో ఎంపికల విధానంలో మార్పులు చోటుచేసుకోకుండా చూడాలని బీసీసీఐ భావిస్తున్నట్లు పలు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ కారణంగా ప్రజ్ఞాన్ ఓజానే మరికొంతకాలం తాత్కాలిక ఛైర్మన్‌గా కొనసాగించవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

లక్ష్మణ్ ప్రభావం పెరుగుతుందా?

బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు నేతృత్వం వహిస్తున్న మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రభావం జట్టు ఎంపికల వ్యవహారంలో పెరిగే అవకాశం





ఉందని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కథనం పేర్కొన్నట్లు సమాచారం. అయితే దీనిపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రపంచకప్‌కు ముందు ఆటగాళ్ల ఎంపిక, జట్టు కూర్పు, భవిష్యత్ ప్రణాళికల్లో స్థిరత్వాన్ని కొనసాగించడం బోర్డుకు కీలకంగా మారింది.

పార్థివ్ పటేల్ దరఖాస్తు చేయలేదా?

వెస్ట్ జోన్ నుంచి ఖాళీ అయిన సెలక్టర్ పదవికి దరఖాస్తుల గడువు అక్టోబరు 14తో ముగిసినట్లు సమాచారం. మాజీ భారత వికెట్ కీపర్ బ్యాటర్ పార్థివ్ పటేల్ ఈ పదవికి దరఖాస్తు చేస్తారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆయన దరఖాస్తు చేయలేదని కొన్ని వార్తా కథనాలు వెల్లడించాయి. ఈ విషయంపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.

ఎస్ఎస్ దాస్ పదవీకాలంపై చర్చ

ప్రస్తుత సెలక్షన్ కమిటీలో ప్రజ్ఞాన్ ఓజాతో పాటు ఎస్ఎస్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా సభ్యులుగా ఉన్నారు. దాస్ డిసెంబరుతో సెలక్టర్‌గా నాలుగేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోనున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఆయనను 2027 ప్రపంచకప్ వరకు కొనసాగించే అవకాశాలపైనా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే కొత్త ఛైర్మన్ నియామకం, ఓజా కొనసాగింపు, ఇతర సభ్యుల పదవీకాలంపై బీసీసీఐ అధికారికంగా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రపంచకప్ సన్నాహాల నేపథ్యంలో సెలక్షన్ కమిటీలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

సన్నీ డియోల్‌తో ప్రగ్యా జైస్వాల్!



హైదరాబాద్, అక్టోబరు 15: టాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక ప్రగ్యా జైస్వాల్ బాలీవుడ్‌లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇప్పటికే అక్షయ్ కుమార్ నటించిన 'ఖేల్ ఖేల్ మే' చిత్రంలో కనిపించిన ఆమె.. ఇప్పుడు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సన్నీ డియోల్ నటిస్తున్న 'సూర్య' సినిమాలో భాగమయ్యారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాన్ని విడుదల చేయడంతో పాటు, విడుదల తేదీని కూడా చిత్రబృందం ప్రకటించింది. ఎం. పద్మకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య' చిత్రంలో సన్నీ డియోల్, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రవికిషన్, మనీష్ వాధ్వా తదితరులు కూడా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కమల్ ముకుత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా విడుదలైన ప్రచార చిత్రంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ చిత్రాన్ని నవంబరు 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. 2018లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న మలయాళ క్రైమ్ థ్రిల్లర్ 'జోసెఫ్' ఆధారంగా 'సూర్య' తెరకెక్కుతోంది. ఈ కథ ఇప్పటికే తెలుగులో రాజశేఖర్ కథానాయకుడిగా 'శేఖర్' పేరుతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తమిళం, కన్నడ భాషల్లోనూ పునర్నిర్మాణమైంది. మరో విశేషం ఏమిటంటే, మలయాళ మూల చిత్రానికి దర్శకత్వం వహించిన ఎం. పద్మకుమారే హిందీ రూపాంతరానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో తన నటనతో గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యా జైస్వాల్.. ఇప్పుడు బాలీవుడ్‌లో వరుస అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నారు. సన్నీ డియోల్ వంటి ప్రముఖ నటుడితో కలిసి నటిస్తున్న 'సూర్య' ఆమె కెరీర్‌కు ఎంతవరకు ఉపయోగపడుతుందో చూడాలి. నవంబరు 20న విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో తెలియాలంటే మరికొంతకాలం వేచి చూడాల్సిందే.



కీర్తి సురేశ్ 'సత్యవాన్ సావిత్రి' టీజర్ విడుదల

హైదరాబాద్, అక్టోబరు 15: జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి'. ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అధికారిక టీజర్ తాజాగా విడుదలైంది. హాస్యం, న్యాయస్థానం నేపథ్యంలో సాగే కథతో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. నవంబరు 20, 2026న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. చిన్నప్పటి నుంచి న్యాయవాది కావాలనే లక్ష్యంతో కుటుంబాన్ని ఎదురించి న్యాయశాస్త్రం చదివిన సావిత్రి అనే యువతి పాత్రలో కీర్తి సురేశ్ నటిస్తున్నారు. ఆమె వృత్తి జీవితంలో చేపట్టిన తొలి కేసు చుట్టూ కథ సాగుతుంది. న్యాయస్థానంలో ఆమె ఎదుర్కొనే సవాళ్లు, అమాయకంగా చేసే వాదనలు టీజర్‌లో నవ్వులు పూయిస్తున్నాయి. గంభీరమైన కోర్టు వాతావరణాన్ని వినోదాత్మకంగా చూపిస్తూ సినిమా కథపై ఆసక్తిని పెంచారు. ప్రముఖ దర్శకుడు, నటుడు మిస్కిన్ ఈ చిత్రంలో మార్కండేయన్ అనే శక్తిమంతమైన న్యాయవాది పాత్రలో కనిపించనున్నారు. న్యాయస్థానంలో సావిత్రికి ప్రత్యర్థిగా ఆయన చేసే వాదనలు, కీర్తి సురేశ్‌తో జరిగే పోటీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వీరిద్దరి మధ్య సాగే కోర్టు సన్నివేశాలు ప్రేక్షకులను అలరించేలా ఉంటాయని టీజర్ సూచిస్తోంది. ఈ చిత్రంలో చారుకేశ్, బాల శరవణన్, శిల్పా మంజునాథ్, బాలాజీ శక్తివేల్, ఆర్. సుందర్‌రాజన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, అరుణ్ విన్సెంట్ ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జీ స్టూడియోస్, డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. న్యాయస్థానంలో జరిగే వాదోపవాదాలను హాస్యం, వినోదంతో మేళవించి రూపొందించిన 'సత్యవాన్ సావిత్రి' నవంబరు 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. కీర్తి సురేశ్ నటన, మిస్కిన్‌తో ఆమె తలపడే సన్నివేశాలు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం ఆశిస్తోంది.



అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్ గత తొమ్మిది నెలలుగా ఒక్క సినిమాకూ అంగీకారం తెలపలేదని వెల్లడించింది. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు వస్తున్న వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తనకు సినిమాల్లో నటించే అవకాశాలు వస్తున్నప్పటికీ, కథలు మనసుకు నచ్చకపోవడంతో కొత్త చిత్రాలకు అంగీకరించడం లేదని మృణాల్ తెలిపింది. గత తొమ్మిది నెలలుగా ఏ సినిమాకూ సంతకం చేయలేదని స్పష్టం చేసింది. ఒక సినిమా కోసం మూడు, నాలుగు నెలల సమయాన్ని కేటాయించాల్సి ఉంటుందని, అంత సమయం వెచ్చించాలంటే కథలో ప్రత్యేకత ఉండాలని అభిప్రాయపడింది. అందుకే కొంతకాలం సినిమాలకు విరామం తీసుకున్నట్లు వివరించింది. అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' చిత్రంలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఆమె చిత్రీకరణలోనూ పాల్గొంటున్నట్లు ముంబై సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. మృణాల్ తాజా వ్యాఖ్యలతో ఆమె ఈ చిత్రంలో నటిస్తుందా లేదా అన్న అంశంపై మరింత ఆసక్తి నెలకొంది. అధికారిక సమాచారం వెలువడితేనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

సినిమా రంగంపై ఆనంది భావోద్వేగం

హైదరాబాద్, అక్టోబరు 15: సినీ పరిశ్రమలో అవకాశాలు అందుకోవడం, నటిగా గుర్తింపు తెచ్చుకోవడం అంత సులభం కాదని నటి ఆనంది అన్నారు. కొన్నిసార్లు ఈ రంగంలో కొనసాగడం తనకు కష్టంగా అనిపిస్తుందని భావోద్వేగానికి గురయ్యారు. ఆమె నటించిన 'గరివిడి లక్ష్మి' సినిమా విడుదలకు ముందు నిర్వహించిన వేడుకలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 'ఒక్కోసారి నేను ఈ సినిమా రంగానికి సరిపోనేమో అనిపిస్తుంది. ఇక్కడ సినిమాలు చేయాలంటే ఎన్నో లెక్కలు, సమీకరణాలు, రాజకీయాలు ఉంటాయి' అంటూ ఆనంది తన మనసులోని మాటలను వెల్లడించారు. ప్రతిభతో పాటు పరిశ్రమలోని పరిస్థితులను కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. అయితే ఆమె ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారన్న దానిపై స్పష్టత లేదు. 'గరివిడి లక్ష్మి' చిత్రంలో ఆనంది ప్రధాన పాత్ర పోషించారు. ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ జానపద కళాకారిణి రెడ్డి విజయలక్ష్మి జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందినట్లు సమాచారం. ఈ పాత్రలో సహజంగా కనిపించేందుకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర మాండలికంలో మాట్లాడేందుకు ఎంతో కష్టపడ్డానని ఆనంది తెలిపారు. ఈ చిత్రం ద్వారా ఆ కళాకారిణికి మరింత గుర్తింపు లభించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు. బుర్రకథ కళాకారిణిగా గరివిడి లక్ష్మి సాధించిన గుర్తింపు, ఆమె జీవితంలో ఎదురైన సవాళ్లు, చేసిన పోరాటాలను ఈ చిత్రంలో చూపించనున్నట్లు తెలుస్తోంది. పురుషాధిక్యత ఎక్కువగా ఉన్న జానపద కళారంగంలో ఒక మహిళగా అడుగుపెట్టి తన ప్రతిభతో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఆమె జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. నిజజీవిత కళాకారిణి పాత్రను తెరపై ఆవిష్కరించేందుకు ఆనంది చేసిన కృషి ఈ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది.



సాయిదుర్గా తేజ్ 19వ సినిమా ప్రకటన

హైదరాబాద్, అక్టోబరు 15: మెగా హీరో సాయిదుర్గా తేజ్ తన తదుపరి చిత్రానికి సంబంధించిన కీలక ప్రకటనతో అభిమానుల్లో ఆసక్తి పెంచారు. తన పుట్టినరోజు సందర్భంగా కెరీర్‌లో 19వ సినిమాను ప్రకటించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, 'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న తేజ కనుమ దర్శకత్వం వహించనున్నారు.కుటుంబ సంబంధాలు, హాస్యం, వినోదంతో కూడిన కథాంశాలకు పేరుపొందిన తేజ కనుమ.. ఇప్పుడు సాయిదుర్గా తేజ్‌తో కలిసి సినిమా చేయనుండటం ఆసక్తికరంగా మారింది. ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సేవ్ ది టైగర్స్' సిరీస్‌తో గుర్తింపు పొందిన ఆయన, ఈసారి వెండితెరపై మెగా హీరోను ఎలా చూపించబోతున్నారనే చర్చ మొదలైంది. ఈ సినిమా కథాంశం ఏమిటి? సాయిదుర్గా తేజ్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నారు? అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ప్రస్తుతం హీరో, దర్శకుడు, నిర్మాణ సంస్థ వివరాలను మాత్రమే ప్రకటించారు. ఇతర నటీనటులు, సాంకేతిక బృందం వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది. సాయిదుర్గా తేజ్ కెరీర్‌లో 19వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ ప్రాజెక్టును ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. విభిన్న కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న ఈ హీరో, తేజ కనుమతో ఎలాంటి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారన్న ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు సాయిదుర్గా తేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటిగట్టు' సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంపైనా అభిమానుల్లో అంచనాలు ఉన్నాయి. ఒకవైపు ఈ ప్రాజెక్టుపై దృష్టి సారిస్తూనే, మరోవైపు కొత్త సినిమాను ప్రకటించడం ద్వారా తన తదుపరి చిత్ర ప్రయాణానికి ఆయన సిద్ధమవుతున్నారు. పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమా ప్రకటన రావడంతో అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



పుట్టపర్తిలో విజయ్-రష్మిక పూజలు

పుట్టపర్తి, అక్టోబరు 15: టాలీవుడ్ ప్రముఖ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. తమ చిత్రం 'రణబాలి' విడుదల వేళ ఈ జంట సత్యసాయి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొనడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో జరుగుతున్న వార్షిక వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం కార్యక్రమాల్లో భాగంగా విజయ్, రష్మిక సాయి కుల్వంత్ హాల్‌ను సందర్శించారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ జంట కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయ్ దేవరకొండకు శ్రీసత్యసాయి విద్యాసంస్థలతో ప్రత్యేక అనుబంధం ఉండటంతో ఆయన పుట్టపర్తి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. విజయ్, రష్మిక కలిసి పూజల్లో పాల్గొన్న దృశ్యాలు, ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com